క్లుప్తంగా

లయన్స్ జిల్లా గవర్నర్‌గా కోటేశ్వరరావు



లయన్ వజ్రపు కోటేశ్వరరావును అభినందిస్తున్న లయన్స్ నాయకులు

సీటీఆర్ఐ: 2025–26 సంవత్సరానికి ప్రతిష్టాత్మక లయన్స్ జిల్లా 316 బి గవర్నర్‌గా రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది వజ్రపు కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. యానాంలోని పెద్దిరెడ్డి కృష్ణ వినాయకరావు కాపు కల్యాణ మండపంలో రెండురోజులుగా కొనసాగుతున్న లయన్స్ ఎన్నికల్లో వజ్రపు కోటేశ్వరరావును గవర్నర్‌గా ఎన్నుకున్నారు. సి.శ్రీనివాసరావు 1వ జిల్లా గవర్నర్‌గా, పీయూ ఉమామహేశ్వరరావును 2వ వైస్ జిల్లా గవర్నర్‌గా ఎన్నుకున్నారు. గత జిల్లా గవర్నర్లు, జిల్లా నాయకులు పాల్గొన్నారు. రాజమండ్రికి చెందిన వారు గవర్నర్‌గా ఎన్నికవ్వడం చాలా గొప్ప విషయమని జిల్లా గవర్నర్ ఐవీవీ ఈశ్వర్‌కుమార్, టి.లక్ష్మారెడ్డి అన్నారు.

మార్కెట్‌లోకి కొత్త యాక్టివా 125 స్కూటర్ విడుదల



మార్కెట్‌లోకి యాక్టివా 125 ఓబీడీ 2బీ విడుదల చేస్తున్న ఏరియా సేల్స్ మేనేజర్ గోకుల్‌పిళ్లై

రాజమహేంద్రవరం రూరల్: రాజమండ్రి మై హోండా షోరూమ్‌లో మంగళవారం యాక్టివా 125 ఓబీడీ 2బీని స్కూటర్‌ను ఏరియా సేల్స్ మేనేజర్ గోకుల్‌పిళ్లై మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా షోరూమ్ జనరల్ మేనేజర్ బి.కోటేశ్వరరావు మాట్లాడుతూ యాక్టివా 125 ఓబీడీ 2బీ అత్యుత్తమ మైలేజ్(60కి.మీ వరకు), నావిగేషన్ సిస్టమ్‌తో బ్లూటూత్ కనెక్టివిటీ, సైడ్ స్టాండ్ కట్–ఆఫ్, పూర్తి డిజిటల్ మీటర్, రియల్–టైమ్ మైలేజ్, సగటు మైలేజ్ సిస్టమ్ వంటి ఫీచర్స్ ఉన్నాయన్నారు. షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నిధి ఆప్‌కే నికట్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఈపీఎఫ్‌వో కార్యాలయం పరిధిలో గురువారం ఉదయం 9.00 గంటల నుంచి నిధి ఆప్‌కే నికట్ డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్–2 వైడి శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలోని సెయింట్ ప్యాట్రిక్స్ అకాడమి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కిమ్స్ హాస్పిటల్‌లోను, కాకినాడ జిల్లా అన్నవరం గ్రామపంచాయతీలోను, పశ్చిమగోదావరి జిల్లా ది రేలంగి పీఏసీఎస్ (సొసైటీ)లోను, జిల్లా కేంద్రమైన ఏలూరులోని సెయింట్ థెరిసా మహిళా కళాశాలలోను, అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం కె.యర్రగొండ సచివాలయంలోను, గంగవరం మండలం జడేరు సచివాలయంలోను, మారేడుమిల్లి గ్రామపంచాయతీలోను ఈ ప్రోగ్రామ్ జరుగుతుందన్నారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్మెంట్‌లు, ఈ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకోవాలన్నారు. పింఛనుదారులు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడానికి ఈ క్యాంపును సందర్శించవచ్చని ప్రాంతీయ ఆయన తెలిపారు.

నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రంతో చర్చలు

రాజమండ్రి రూరల్: నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కేంద్రంతో అంతర్గతంగా చర్చిస్తున్నారని మాజీ మంత్రి, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోరంట్ల మాట్లాడారు. జనాభా విషయంలో దక్షిణాది రాష్ట్రాలు ముందు నుంచి చాలా క్రమశిక్షణ పాటించాయన్నారు. ఇప్పుడు జనాభా పేరుతో ఎంపీ సీట్లు తగ్గించడం సరికాదన్నారు. రాజమండ్రిలో 12 ఎకరాల్లో క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని, దీనిపై ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్నితో చర్చించినట్టు తెలిపారు.

ఐఎన్‌టీయూసీ కాంగ్రెస్ అనుబంధ విభాగమే

రాజమహేంద్రవరం సిటీ: దశాబ్దాలుగా ఐఎన్‌టీయూసీ ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమేనని ఆ పార్టీ నాయకుడు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు జేటీ రామారావు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వేరే పార్టీలో ఉంటూ కాంగ్రెస్ అనుబంధ విభాగమైన ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నగరానికి చెందిన వాసంశెట్టి గంగాధర్ తనను ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ సంజీవరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారని ప్రకటించి, ఐఎన్‌టీయూసీని స్వతంత్ర సంస్థగా పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తనను ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా నియమించారని రామారావు తెలిపారు.



నిర్మానుష్యంగా వై జంక్షన్ రోడ్డు



ఖాళీగా దర్శనమిస్తున్న కంబాల చెరువు హైటెక్ బస్టాండ్ ప్రాంతం

భానుడి భగభగలు

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- మధ్యాహ్నం ఖాళీగా దర్శనమిస్తున్న రహదారులు
- ఎండ తీవ్రతకు బయటకు రావడానికి జంకుతున్న నగరవాసులు

ప్రకాశం నగర్ : మార్చి నాలుగో వారంలోనే భానుడి భగభగలు ప్రారంభం కావడంతో జనం బయటకు రావడానికి జంకుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో నగరంలోని ప్రధాన ప్రాంతాలు జన సంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నానికి 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే వై జంక్షన్, హైటెక్ బస్టాండ్, నందం గనిరాజు జంక్షన్, దేవిచౌక్ వంటి ప్రాంతాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ముఖ్యంగా రోజువారీ కూలీ చేసుకునే కార్మికులు, ఆటో, రిక్షా కార్మికులు ఎండ వేడిని తట్టుకోలేక చెట్ల నీడన సేద తీరుతున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా బయటకు వెళ్లేవారు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గొడుగు, టోపీ, స్కార్ఫ్ ధరించి బయటకు రావాలని, కాటన్ లేత రంగు దుస్తులు ధరించడంతో పాటు, మిటమిన్ ఏ, సీ అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని చెబుతున్నారు. వీటితో పాటు రోజుకు 4 నుంచి 5



జనసంచారం లేని దేవీచౌక్ సెంటర్

లీటర్ల మంచినీరు తాగాలని సూచిస్తున్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగవద్దని, అత్యవసరమైన పరిస్థితుల్లో బయటకు రావాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

మరో రెండు మాసాలు ఇదే పరిస్థితి

మార్చి మూడవ వారంలోనే ఎండలు 34 నుంచి



స్కార్ఫ్ కట్టుకుని స్కూటర్‌పై ప్రయాణిస్తున్న యువతి

36 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో రాబోయే ఏప్రిల్, మే మాసాల్లో ఎండల తీవ్రత ఏ విధంగా ఉంటుందోనని జనం భయాందోళనకు గురవుతున్నారు. ఉదయం 12 గంటలలోపే రోజువారీ పనులు పూర్తి చేసుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు.

పండ్ల రసాలకు ప్రాధాన్యత



సమ్మర్ సీజన్‌లో వివిధ రకాల కూల్‌డ్రింక్‌లు, సోడాలు, బటర్ మిల్క్ వ్యాపారం బాగా ఉంటుంది. గతంతో పోలిస్తే ఇప్పుడు కూల్ డ్రింక్‌ల వ్యాపారం ఆశించిన స్థాయిలో లేదు. ప్రస్తుతం వివిధ కంపెనీలకు చెందిన కొబ్బరి బొండం నీరు, పండ్ల రసాలు జ్యూస్‌లు లీటర్, అర లీటర్, 250 ఎంఎల్ పరిమాణంలో సీసాలు, టెట్రా ప్యాకెట్లు మార్కెట్‌లోకి వచ్చాయి. ముఖ్యంగా కొబ్బరి నీళ్లు, చెరకు రసం, పండ్ల రసాలు వంటివి ప్రకృతిసిద్ధమైనవి తాగేందుకు ప్రజలు ప్రాధాన్యత ఇస్తున్నారు.

– ఎ.వెంకటరమణ, వ్యాపారి

చలివేంద్రాల ఏర్పాటు

ఎండ తీవ్రత దృష్ట్యా నగరంలో కొన్ని చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. స్వచ్ఛంద సేవా సంస్థలతో పాటు ఆటో యూనియన్లు, కార్మిక సంఘాలు, వ్యాపార సంస్థలు పెద్ద ఎత్తున రోడ్ల పక్కన, ప్రధాన సెంటర్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాయి. ప్రజలకు తాగునీరు, మజ్జిగను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వీటితో పాటు జనం ఎండ వేడిమి తట్టుకునేందుకు కొబ్బరి బొండాలు, కూల్ డ్రింక్‌లు, సోడాలు, రోజ్ మిల్క్, కోవా, కోకోనట్ జ్యూస్, లస్సీ, పండ్ల రసాలు తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. శీతల పానీయాలకు డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో కొబ్బరి బొండాల ధరలు ఆకాశాన్నంటాయి. ఒక్క బొండాం ధర రూ.30, కొబ్బరి నీరు లీటర్ బాటిల్ ధర రూ.120 పలుకుతోంది. వివిధ రకాల కూల్ డ్రింక్‌లు, బటర్ మిల్క్, లస్సీలు వంటివి తాగేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కళాశాల సిబ్బంది, ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు

సీటీఆర్ఐ: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం రాజమహేంద్రవరంలోని కంబాలచెరువు పార్కు, పుష్కర్‌ఘాట్ ప్రాంతాల్లో పేదలకు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొని, పేదలకు వికలాంగులకు, దుప్పట్లను అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు విద్యార్థులను, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ పీఓ ఎం.కాస్మా, చంటమ్మ, వీబీటీ సుందరి, పీఎస్ఎస్ దుర్గాప్రసాద్, దుర్గాబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితుడు దీపక్‌ను వెంటనే అరెస్టు చేయాలి

ప్రకాశం నగర్ : డాక్టర్ అంజలిపై లైంగిక వేధింపులకు పాల్పడి, ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించిన దీపక్‌ను తక్షణమే అరెస్టు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జరీనా షరీఫ్, పి తులసి డిమాండ్ చేసారు. సంఘటన విషయం తెలుసుకున్న ఐద్వా నాయకులు మంగళవారం హాస్పిటల్ వద్దకు చేరుకొని బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారు చేస్తున్న ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిందితుడికి శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బాధితురాలు కోలుకునే వరకు ఆమెకు అవసరయ్యే వైద్య సేవలకు హాస్పిటల్ యాజమాన్యం, ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేసారు.

పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా గుర్తించాలి

సీటీఆర్ఐ: పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా ప్రభుత్వం గుర్తించాలని ఇదే అంశం ప్రధాన అజెండాగా ముందుకు వెళుతున్నట్టు ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యామిజాల నరసింహమూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు పొదిలి నారాయణమూర్తి తెలిపారు. మంగళవారం రాజమహేంద్రవరంలో తూర్పుగోదావరి జిల్లా కమిటీ సమావేశం పేపర్ మిల్ రోడ్డులో ఉన్న దువ్వూరి రామకృష్ణారావు ట్రస్ట్ సభా మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ రాష్ట్రమంతటా అన్ని జిల్లాల్లోనూ పురోహిత బ్రాహ్మణ సమాఖ్యలను విస్తరిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా రాబోయే పుష్కరాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రభుత్వ సహకారం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్ర పుష్కర కమిటీ అధ్యక్షుడు తెన్నేటి సునీల్ శర్మ, జిల్లా అధ్యక్షుడు మర్ల సీతారామ శాస్త్రి, గౌరవ సలహాదారు పురాణపండ మధు శర్మ, తూర్పు గోదావరి జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్పెంటర్ మృతి

కడియం: పనిలో నిమగ్నమైన సమయంలో కడియం గ్రామానికి చెందిన కార్పెంటర్ ఐసెట్టి ఏసురత్నం (49) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడియం హెచ్‌సీ యం.సురేష్‌కుమార్ కేసు నమోదు చేసారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఏసురత్నం ఎప్పటిలాగే కడియపుసావరంలోని ఒకరి ఇంటికి పని నిమిత్తం వెళ్లారు. అక్కడ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నారు. దీంతో అతడిని హుటాహుటిన కడియం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సొసైటీ అభివృద్ధికి తోడ్పడాలి

కడియం: స్థానిక విశాల సహకార పరపతి సంఘం అభివృద్ధికి సభ్యులందరూ తోడ్పడాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అన్నారు. మహాజన సభ మంగళవారం ఓపీఐసీ యం.కృష్ణమోహన్ అధ్యక్షతన నిర్వహించారు. సంఘం అభివృద్ధిపై పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్, నీటి సంఘం అధ్యక్షుడు చిక్కాల ఈశ్వరరావు, సభ్యులు లక్ష్మణరావు, జగతా వెంకటేష్, విఘ్నేశ్వరుడు, రైతులు పాల్గొన్నారు.

శంఖారావ దంపతులకు 'టీబీఆర్ ఐకాన్' అవార్డు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అఖండ శంఖారావ 'యుగళం' డాక్టర్ కొండా నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులు టీబీఆర్ ఐకాన్ –2025 అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లో ఇటీవల తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చింతపట్ల వెంకటచారి ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నరసింహారావు, మంగాదేవి దంపతులకు టీబీఆర్ ఐకాన్–2025 అవార్డును సినీ నటుడు పృథ్వీరాజ్ చేతుల మీదుగా అందజేసారు. శంఖారావంతో ఈ దంపతులు కనబరిచిన విశేష కృషిని గుర్తించి ప్రతిభా పురస్కారాన్ని అందజేసినట్టు నిర్వాహకులు మంగళవారం తెలిపారు.

ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



కంప్యూటర్ వితరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రస్టు మేనేజర్ సూర్య

రాజమహేంద్రవరం రూరల్: శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం ఎంతో ప్రగతి సాధిస్తోందని, మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. కాతేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ నాలుగు కంప్యూటర్లు వితరణ చేశారు. వాటిని మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బుచ్చయ్యచౌదరి ప్రారంభించారు. బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ మేనేజర్ డాక్టర్ జె.సూర్య మాట్లాడుతూ బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, అమెరికాలో ఉంటున్న పి కృష్ణ, దేశంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక విద్య, హెల్త్ అండ్ న్యూట్రిషన్, విలువలతో కూడిన విద్య అందించేందుకు ట్రస్ట్ ద్వారా కృషి చేస్తున్నట్టు చెప్పారు. కంప్యూటర్లు అందజేసిన ఫౌండేషన్ వారికి ప్రధానోపాధ్యాయిని దేవా అనిత ధన్యవాదాలు తెలిపారు. పొలిటికల్ కోఆర్డినేటర్ వంశీ, గ్రామ పెద్దలు గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ, విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం

కంబాలచెరువు: డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జియోన్ అంధుల పాఠశాలలో ప్రాంతీయ భాషలో దృష్టిలోపం ఉన్న వ్యక్తులకు బ్రెయిలీ సాధనాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. దీనికి న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి హాజరయ్యారు. పేద పిల్లలకు, మహిళలకు, వృద్ధులకు ఉచిత న్యాయ సహాయం అందించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో జిల్లా కోర్టుల్లో న్యాయసేవాధికార సంస్థ ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాల విద్యాధికారి కె.వాసుదేవ రావు, వెల్ఫేర్ అధికారి యు.రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంహిత డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్



క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఎంపికైన విద్యార్థులతో సంహిత కళాశాల అధ్యాపకులు

కంబాలచెరువు: స్థానిక తాడితోట జంక్షన్‌లోని సంహిత డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎస్ఎస్ఐటీకి చెందిన హెచ్ఆర్ జె.కల్యాణ్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో 83 మంది హాజరుకాగా వీరిలో 29 మంది విద్యార్థులు రూ.3 లక్షల నుంచి రూ.3.20 లక్షల వార్షిక వేతనంతో ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.రాజేష్, ప్లేస్‌మెంట్ కమిటీ సభ్యులు బి.హర్షిత, టి.అనూహ్య, కళాశాల అధ్యాపక బృందం, ఏవో బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లింపుపై 50 శాతం వడ్డీ రాయితీ

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వం ఆస్తిపన్ను బకాయిలపై చెల్లింపుదారుల సౌకర్యార్థం వడ్డీలో 50 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనరు కేతన్ గార్గ్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలో ఇంటి పన్ను, ఖాళీ స్థలాలపై పన్నులు సకాలంలో అనగా మొదటి అర్ధ సంవత్సరానికి జూన్ నెలాఖరులోపు, రెండవ అర్ధ సంవత్సరానికి డిసెంబరు నెలాఖరు లోపు పన్ను చెల్లించని వారు 2 శాతం వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆస్తిపన్ను , ఖాళీ స్థలాల పన్ను బకాయిలను ఈ నెల 31వ తేదీలోపు ఒకేసారి ఏకమొత్తంలో చెల్లిస్తే, వడ్డీ 50 శాతం రాయితీని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కడియం: కడియపులంక గ్రామదేవత పల్లాలమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయాన్ని ఏడాది క్రితం పునర్నిర్మించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ విగ్రహంతో పాటు 108 కలశాలతో మహిళలు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. నదీ జలాలలతో అమ్మవారికి స్నపనం నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలి

ప్రకాశం నగర్ : దేశంలో వ్యవసాయాన్ని పరిరక్షించాలని, పంటలకు కనీస మద్దతు ధర చట్టం అమలు చేసి మూడు లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు అక్కినేని వనజ డిమాండ్ చేసారు. సీపీఐ రాజకీయ ప్రచారజాతలో భాగంగా మంగళవారం స్థానిక మంగళవారిపేట, కొబ్బరికాయ మార్కెట్ వార్డుల్లో ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ మోదీ ఎన్నికల ముందు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సిఫార్సులు అమలు చేయడం సాధ్యం కాదని మోదీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా గత నాలుగేళ్లుగా రైతులు ఉద్యమిస్తూనే ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి కొండలరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె జ్యోతి రాజు, పి లావణ్య పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర కృషి అభినందనీయం



స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమాన్ని సందర్శించిన జిల్లా వృద్ధుల దివ్యాంగుల సంక్షేమ సంచాలకులు రాజు

రాజమహేంద్రవరం సిటీ: వృద్ధుల సంక్షేమం, వృద్ధాశ్రమ నిర్వాహణలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ పనితీరు ప్రశంసనీయమని జిల్లా వృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ ఇన్‌చార్జి సహాయ సంచాలకులు యు.రాజు అన్నారు. మంగళవారం నగరంలో స్థానిక లాలాచెరువు వద్ద ఉన్న స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న వృద్ధులతో ముచ్చటించి వారికి అందుతున్న సదుపాయాలు, సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వర్ణాంధ్ర సేవలను నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు, సహాయ సంచాలకులు రాజుకు వివరించారు. వృద్ధులకు, దివ్యాంగులకు కావలసిన ఉపకరణాల కోసం జిల్లా వృద్ధుల సంక్షేమ శాఖను సంప్రదించాలని రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సిబ్బంది ధనలక్ష్మి, మీరాకుమారి, కొండలరావు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఆర్థిక సహాయం



వైఎస్సార్‌సీపీ కార్యకర్త ముజ్జుకు రూ.10వేల ఆర్థికసాయం అందజేస్తున్న చందన నాగేశ్వర్


రాజమహేంద్రవరం రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న కొంతమూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ముజ్జు తల్లి సయ్యద్ కాత్తున్ బీబీని మంగళవారం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. ఆమె కొంతకాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో బీబీని చందన నాగేశ్వర్ పరామర్శించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ముజ్జుకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని వేంకటేశ్వరనగర్‌లో వేంచేసియున్న భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయం 13వ వార్షిక కల్యాణోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో ఆగమ సలహాదారులు ఖండవల్లి రాధాకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. శ్రీగాయత్రి నృత్య కళానికేతన్ విద్యార్థులతో నృత్య ప్రదర్శనలు అలరించాయి.

• ఆకాశంలో అద్భుత దృశ్యం.. సూర్యాస్తమయం





గోదారమ్మపై నిర్మించిన రెండు వంతెనలు హేవ్ లాక్ బ్రిడ్జి, మూడో రైల్వే వంతెన మధ్య నుంచి సూర్యుడు అస్తమిస్తున్న దృశ్యం, రంగులు మారిన ఆకాశం చూపరులను ఎంతో ఆకట్టుకుంది. రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద మంగళవారం సాయంత్రం ఈ మనోహర దృశ్యం కనువిందు చేసింది. పుష్కరాల రేవుకు వచ్చే సందర్శకులు, పర్యాటకులు రంగుల మాయాజాలంగా మారిన ఆకాశాన్ని, సూర్యాస్తమయాన్ని ఆసక్తిగా తిలకించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ , రాజమహేంద్రవరం